క్లుప్తంగా

యంబాయి లడ్డూ.. రూ.70 వేలు



యంబాయిలో లడ్డూను దక్కించుకున్న రామన్న

బేతంచెర్ల : మండలంలోని యంబాయి గ్రామంలో వినాయక చవితి నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం లడ్డూ వేలం పాటను నిర్వహించారు. రామన్న అనే వ్యక్తి రూ.70 వేలకు పాటపాడి లడ్డూను దక్కించుకోగా, అదే గ్రామానికి చెందిన చాకలి రమణ కలశం టెంకాయను రూ.40 వేలకు పొందారు. ఈ సొమ్ముతో వచ్చే ఏడాది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా రంగాపురం గ్రామంలో 13 కేజీల లడ్డూ వేలంపాట జరిగింది. గ్రామానికి చెందిన బిల్డింగ్ యూత్ సభ్యులు యోగి యాదవ్, మధుసూదన్‌రెడ్డి రూ.58,500కి లడ్డూను సొంతం చేసుకున్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కోసం ఇదే గ్రామానికి చెందిన కీశేలు పీఆర్ ఓబుల రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి పీఆర్ ప్రభావతి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ విషయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను పూలమాలలతో సన్మానించి, ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



మృతుని భార్యకు నగదు అందజేస్తున్న పార్టీ నాయకులు

డోన్: పట్టణ శివారులో జూలై 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన 30వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్త దూదేకుల ఇమాం బాషా అలియాస్ సలీం(20) కుటుంబానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. శుక్రవారం పార్టీ నేతలు మృతుని ఇంటికి వెళ్లి ఈ సొమ్మును ఆయన భార్యకు అందజేశారు. ఎద్దుల రాజేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.ఈ. రాజవర్ధన్, పార్టీ నాయకులు ధారా ప్రతాప్‌రెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి, రంగస్వామి, మేకల రాజు, గద్దం సురేష్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, పాలుట్ల మీనాక్షి, రఘురాం పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలి



నందవరంలో అపరిశుభ్రతను పరిశీలిస్తున్న డీపీఓ

బనగానపల్లె రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) లలితాభాయి సూచించారు. శుక్రవారం మండలంలోని నందివర్గం, నందవరం గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకూడదని, ప్రతి రోజు కాల్వలను శుభ్రం చేయాలని ఆదేశించారు. అలాగే పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు గురుప్రసాద్, మహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విదేశీ పర్యాటకుల సందడి



గుహల వద్ద విదేశీ పర్యాటకుల బృందం

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో ఉన్న వాల్మీకి గుహల్లో శుక్రవారం విదేశీ పర్యాటకులు సందడి చేశారు. అమెరికా, తైవాన్, చైనా తదితర దేశాలకు చెందిన పలువురు పర్యాటకులు గుహలను సందర్శించారు. గుహలను కలియ తిరిగిన విదేశీ బృందం గుహల విశేషాలను గ్రామస్తులు లక్ష్మీరంగయ్య, రామకృష్ణలను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు ఉత్తరాఖండ్, తమిళనాడు, నాసిక్, కర్ణాటక ప్రాంతాలకు చెందిన పలువురు పర్యాటకులు కూడా గుహలను సందర్శించారు.

వినాయక.. వీడ్కోలిక



కొలిమిగుండ్లలో ఊరేగింపుగా వెళుతున్న విగ్రహాలు



కేరింతలు కొడుతున్న యువత

- గ్రామాల్లో ఉత్సాహంగా సాగిన నిమజ్జన వేడుకలు
- రంగులు చల్లుకుంటూ సందడి చేసిన యువత
- డ్రమ్స్ వాయిద్యాలు, నృత్యాల నడుమ శోభా యాత్ర

కొలిమిగుండ్ల: మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని గ్రామాల్లో పెద్ద ఎత్తున విగ్రహాలను ఏర్పాటు చేశారు. చివరి రోజు నిమజ్జనం సందర్భంగా వయసుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దలు శోభాయాత్రలో సందడి చేశారు. యువత నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా సాగారు. రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. మహిళలు సైతం వేడుకల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని వీధులన్నీ రంగులతో నిండిపోయాయి. బాణసంచా పేల్చుతూ భారీ గణనాథులను మేళతాళాలు, యువత కేరింత మధ్య నిమజ్జనానికి తీసుకెళ్లారు. చింతలాయిపల్లెలో అల్లర్లకు అవకాశం లేకుండా ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.అవుకులో విగ్రహాల నిమజ్జనం ఉప్పలపాడు రోడ్డులోని రిజర్వాయర్‌లో చేపట్టారు. కొలిమిగుండ్ల మండలంలోని పెట్నికోట ఎస్సీ కాలనీలో ఊరేగింపు సమయంలో ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు సకాలంలో చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.



మీరాపురంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం



అవుకులో గణనాథుడి నిమజ్జనం

ఘనంగా గణనాథుల నిమజ్జనం

బనగానపల్లె రూరల్: మండలంలోని మీరాపురం, పాతపాడు, జ్వాలాపురం, సాదుకొట్టం, పసుపల నందవరం, బీరవోలు, ఇల్లూరుకొత్తపేటతో పాటు మరికొన్ని గ్రామాల్లో నిమజ్జన వేడుకలు సందడిగా సాగాయి. ఆటోలు, ట్రాక్టర్లలో ముస్తాబు చేసిన గణనాథ విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువులు, నీటి కుంటల్లో నిమజ్జనం చేశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాలు పండుగ వాతావరణంతో కళకళలాడాయి. నిమజ్జన ఘాట్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బనగానపల్లె సీఐలు మంజునాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

బైబై.. గణేశా..!



కోవెలకుంట్ల: గణనాథుడి శోభాయాత్ర

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 52 మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు నిమజ్జన సందర్భంగా విగ్రహాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. యువకుల నృత్యాలు, డ్రమ్స్ అలరించాయి. వినాయక విగ్రహాలను ఆయా గ్రామ సమీపాల్లోని కుందూనది, పాలేరు, కుందరవాగుల్లో నిమజ్జనం చేశారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సాహంగా నిమజ్జన వేడుక

డోన్ టౌన్: మండలంలోని గ్రామాల్లో కొలువైన వినాయకులను ఆయా చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. పట్టణ వినాయకులను వెంకటాపురం తుమ్మల చెరువులో నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో మేళతాళాలు, డ్రమ్స్, నృత్యాలు, చిందులు, రంగుల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపు సాగింది. పలు చోట్ల అన్నదానాలు, అల్పాహారాలు వడ్డించారు. నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా సాగేందుకు డీఎస్పీ శ్రీనివాస ఆదేశాల మేరకు సీఐలు రాకేష్, ఇంతియాజ్‌బాషా, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్, మమత, ట్రైనింగ్ ఎస్ఐ రవిప్రకాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



డోన్: నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయకుడు



డోన్: ఆటోనగర్‌లో అల్పాహారం వడ్డిస్తున్న నిర్వాహకులు

లంబోదరుడికి బుగ్గన పూజలు



పాతపేటలో గణేశుడిని దర్శించుకుంటున్న బుగ్గన

డోన్: స్థానిక అమ్మవారిశాలలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట్రికె హరికిషన్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అలాగే డోన్ పాతపేట, బేతంచెర్ల బైటిపేటలో కొలువైన గణనాథులను బుగ్గన దర్శించుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్ కటిక వేణు, నాయకులు కురుకుంద హరి, రాజవర్ధన్, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఆర్ఎస్ రంగాపురంలో..

అంబరాన్నంటిన సంబరం



బేతంచెర్ల: వినాయకుడికి వీడ్కోలు పలుకుతున్న గ్రామస్తులు

బేతంచెర్ల : మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం 96 వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఆర్ఎస్ రంగాపురం, సిమెంటునగర్ (గ్రామ పంచాయతీ), శంకలాపురం, సీతారామాపురం, ముద్దవరం, ముసలాయిచెర్వు, బుగ్గానిపల్లె, బలపాలపల్లె గ్రామాల్లో యువకుల కోలాహలం మధ్య ఊరేగింపు సాగింది. గ్రామ వీధుల మీదుగా యువకులు రంగులు చల్లుకుంటూ, గణపతి బప్పా మోరియా నినాదాలతో హోరెత్తించారు. సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

డోన్ టౌన్: తేనె టీగలను పెంచడం ద్వారా రైతులకు అదనపు ఆదాయంతో పాటు పంట దిగుబడులను పెంచుకోవచ్చని మహారాష్ట్రకు చెందిన హంబుల్ బి సంస్థ ప్రతినిధులు అన్నారు. డోన్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో శుక్రవారం రైతులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పించారు. తేనె టీగలు పెంచడానికి యూనిట్ కాస్ట్ రూ.82,500 అవుతుందని.. ఇది మండల సమాఖ్య నుంచి రుణం పొంది తిరిగి చెల్లించవచ్చని తెలిపారు. సేకరించిన తేనెను స్వయంగా అమ్ముకోవచ్చని లేదా బై బ్యాక్ అగ్రిమెంటు కింద హంబుల్ బి సంస్థ రూ.200తో కొనుగోలు చేస్తుందన్నారు. ఉద్యానవనశాఖ అధికారిణి కల్యాణి, డీపీఎం సురేష్, డోన్ ఏపీఎం మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం



కోవెలకుంట్ల: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్,



బనగానపల్లె: కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: పట్టణంలోని వివిధ ప్రభుత్వ విద్యాసంస్థల్లో శుక్రవారం తెలుగు మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో ముందుగా వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో ఏ విషయాన్ని అవగాహన చేసుకోవాలన్నా, ఏ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలన్నా ముందుగా మాతృభాషపై పట్టు సాధించాలన్నారు. అలాగే పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత, సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలల్లో తెలుగుభాష దినోత్సవాన్ని జరిపారు. అధ్యాపకులు కృష్ణశశాంక, భాస్కర్‌రెడ్డి, అన్నపూర్ణ, రామసుబ్బారెడ్డి, కృష్ణదాసు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

- బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగుభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిక సత్యప్రపూర్ణ, అధ్యాపకులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవం జరిగింది.

గిడుగు రామ్మూర్తి సేవలు మరువలేనివి

కొలిమిగుండ్ల: తెలుగు భాష వైభవం, వ్యవహారిక భాష కోసం ఉద్యమించిన గిడుగు రామ్మూర్తి సేవలు ఎనలేనివని ఆపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. గిడుగు సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు పండిట్ గురప్ప తెలుగు సాహిత్యం గురించి విద్యార్థులకు వివరించారు. గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. తెలుగు పండిట్ వైఈఎస్ నారాయణరెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కొండప్ప పాల్గొన్నారు.

- డోన్ టౌన్ : గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి జీవిత చరిత్రలను ఉపాధ్యాయులు వివరించారు. నెహ్రూనగర్ కాలనీలో తొగట సురేష్‌బాబు రచించిన మానవీయతాధిది పుస్తకాన్ని ఎంఈఓలు ప్రభాకర్, నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పద్యరూపంలో ఉన్న ఈ పుస్తకాన్ని గ్రంథరూపంలోకి తీసుకురావడానికి ఆర్థిక సహకారం అందించిన మారెళ్ల రాజశేఖర్‌రెడ్డిని, రచయితను సత్కరించారు. వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు జగన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కార్యదర్శి రంగయ్య పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఫుట్‌బాల్ క్రీడామైదానాన్ని ప్రారంభించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆపస్ నాయకులు



పాతపేట హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గిడుగు రామ్మూర్తికి నివాళి

ప్యాపిలి: తెలుగు భాషకు విశిష్ట సేవలందించిన గిడుగు రామమూర్తి, హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను శుక్రవారం ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమీక్షా సమావేశం

బనగానపల్లె: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శుభకార్యం

బనగానపల్లె: పట్టణంలోని కొండపేట ఎస్సీ కాలనీకి చెందిన కొమ్ము చిన్న మద్దిలేటి కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఈయన వెంట పార్టీ నాయకులు అంబటి రవికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహుని సేవలో జేసీ

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల కొండపై వెలసిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు వేదపండితులు స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందుగా నందిపాడు సమీపంలో పవర్‌గ్రిడ్‌కు చెందనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కానుండడంతో భూమిని పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

పశువైద్యాధికారిని నియమించాలి

ప్యాపిలి: జలదుర్గం పశువైద్యశాలకు పశువైద్యాధికారిని నియమించాలని మండల కోఆప్షన్ మెంబర్ రసూల్, సీఐటీయూ మండల కార్యదర్శి నేసే శ్రీనివాసులు, గ్రామస్తుడు చిక్కెం రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన

బేతంచెర్ల : నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు భార్గవ్, మధు శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు నాయకులు, ప్రజలతో కలిసి నిరసన తెలిపారు. వర్షాకాలంలోనూ తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు జరగకపోవడంతో దోమల బెడద పెరిగి విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గణనాథులకు విశేష పూజలు



కోవెలకుంట్ల: సాయినగర్‌లో పూజలందుకుంటున్న వినాయకుడు

కోవెలకుంట్ల: పట్టణంలోని ఆయా కాలనీల్లో కొలువుదీరిన గణనాథులు మూడు రోజుల నుంచి పూజలందుకుంటున్నారు. పట్టణంలో పాండురంగస్వామి దేవాలయం, సంతమార్కెట్, రంగరాజుపేట, సభాపతిరోడ్ రామాలయం, కుమ్మరివీధి, పెద్దమ్మగుడి, గాంధీనగర్, బీఎస్ఎన్ఎల్ టవర్, బసిరెడ్డిబావి వీధి, దాసరివీధి, చిన్నబారం ఇమాం చావిడి, సంతపేట, ఎస్ఎల్‌వీటీ, గుద్దేటివీధి, చాకలిపేట, శ్రీవిద్యస్కూల్, నాగులకట్ట, కరెంట్ఆఫీస్, సాయినగర్, సీతారాంనగర్, పాత పోస్టాఫీస్, సాయినగర్, పాతశివాలయం, ఏకలవ్యనగర్, అమ్మవారిశాల, గాంధీసెంటర్, సుంకులమ్మ వీధి తదితర ప్రాంతాల్లో 47 చోట్ల వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను కొలువుంచారు. శుక్రవారం ఆయా మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. ఆదివారం నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి



యోగాంధ్ర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యాయామ విద్య విభాగం ఇన్‌చార్జ్ రామన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో పాల్గొని ఉన్నత స్థాయి క్రీడాకారులుగా రాణించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. అధ్యాపకులు బాబునాథ్, బడేసాహెబ్, సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బేతంచెర్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి రాజు సూచించారు. శుక్రవారం మండలంలోని ముద్దవరం జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో భారత్ హాకీ క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, తెలుగు భాషపై వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



సంజామల: ఉపాధ్యాయులతో ఎంఈఓ

ఉపాధ్యాయులకు సత్కారం

సంజామల: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భాషా, మౌలాలి, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను ఎంఈఓ రమణారెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలతో పాటు పిరమిడ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పరమేశ్వర్ రెడ్డి, అరుణ కుమారి, నాగరాజు, మాధవ, రంగన్న, నరసింహా పాల్గొన్నారు.

కనులపండువగా స్వాతి వేడుకలు



సహస్ర దీపాలంకరణ సేవలో నరసింహస్వామి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం పురస్కరించుకుని స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశస్నపనం, నరసింహహోమం, తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ కనులపండువగా నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారి ఊరేగింపు జరిగింది. ఆలయ ఈఓ రామాంజనేయులు పర్యవేక్షించారు.